
సాక్షి
శ్రీకాకుళం

శుక్రవారం । 19 । జనవరి । 2024



ప్రీ పబ్లిక్‌కు సన్నద్ధం

ఇంటర్ ప్రీ పబ్లిక్ పరీక్షలు నేటి నుంచి జరగనున్నాయి. అందుకు తగ్గ ఏర్పాట్లు చేశారు. - 8లో



175/175 సీట్ల గెలుపే..

క్లీన్‌స్వీప్ లక్ష్యంగా వైఎస్సార్‌సీపీ నాయకులు పనిచేస్తున్నారు. అందుకు తగ్గ ప్రణాళికలు రచిస్తున్నారు. - 8లో



దట్టంగా పొగమంచు

ఆమదాలవలస రూరల్: తెల్లవారుజామున విపరీతంగా మంచు కురుస్తుండడంతో వాహనదారులు, ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. మూడు రోజుల నుంచి ఉదయం మంచు కురవడం వల్ల అపరాల పంటలు పూర్తిగా దెబ్బతింటున్నాయి.

న్యూస్‌రీల్

డీసీసీబీ బోర్డు మెంబర్ల పదవీ కాలం పొడిగింపు

శ్రీకాకుళం క్రైమ్ : రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు జిల్లా కేంద్ర సహకార బ్యాంకు బోర్డు మెంబర్ల పదవీ కాలం మరో ఆరు నెలలు పొడిగిస్తున్నట్లు జిల్లా డీసీసీబీ సీఈఓ వరప్రసాద్ ఓ పత్రికా ప్రకటన ద్వారా గురువారం తెలియజేశారు. ఈ మేరకు రాష్ట్ర ప్రిన్సిపల్ సెక్రటరీ కార్యాలయం నుంచి ఉత్తర్వులు అందాయన్నారు. మన జిల్లాతో పాటు విజయనగరం, విశాఖపట్నం, కాకినాడ, గుంటూరు, ప్రకాశం, అనంతపురం, కడప, చిత్తూరు, కర్నూలు జిల్లాలకు కూడా ఇది వర్తిస్తుందని పేర్కొన్నారు. దీని ప్రకారం జిల్లా కమిటీలో ఉన్న ఏడుగురు బోర్డు మెంబర్ల పదవీకాలం ఈనెల 18 నుంచి జూలై 17 వరకు పెరిగింది.

ఆయన నేత్రాలు సజీవం



వెంకటరామం

శ్రీకాకుళం కల్చరల్: శ్రీకాకుళం విశాఖ 'బి' కాలనీలో నివాసముంటున్న సింహాద్రి వెంటరామం (85) బుధవారం మృతి చెందారు. ఆయన కుటుంబ సభ్యులు నేత్రదానంపై ఆలోచన చేసి రెడ్‌క్రాస్ చైర్మన్ పి.జగన్మోహనరావుకు తెలియజేశారు. కుటుంబ సభ్యుల అంగీకారంతో మగటపల్లి కల్యాణ్ నేత్రసేకరణ కేంద్రం ద్వారా ఆయన కార్నియాలు సేకరించి విశాఖలోని ఎల్‌వీ ప్రసాద్ నేత్రసేకరణ కేంద్రానికి అందించారు. ఎవరైనా నేత్రదానం చేయాలనుకునే వాళ్లు 7842699321 నంబర్‌కు కాల్ చేయాలని సూచించారు.

అంతర్‌రాష్ట్ర క్రికెట్ టోర్నీకి ఇద్దరు ఎంపిక



వి.క్రాంతికుమార్



సీహెచ్ రోహిత్



ఎం.వెంకటరమణ

శ్రీకాకుళం న్యూకాలనీ: బీసీసీఐ ఆధ్వర్యంలో జరగనున్న అంతర్‌రాష్ట్ర అండర్-14 బాలుర క్రికెట్ టోర్నమెంట్‌కు శ్రీకాకుళం జిల్లా నుంచి ఇద్దరు క్రీడాకారులు ఎంపికయ్యారు. ఫిబ్రవరి 2 నుంచి గోవా వేదికగా జరగనున్న ఈ అంతర్‌రాష్ట్ర క్రికెట్ టోర్నీలో పాల్గొనే ఏసీఏ అండర్-14 ఆంధ్రా జట్టుకు జిల్లా నుంచి వి.క్రాంతికుమార్, సీహెచ్ రోహిత్ ఎంపికయ్యారు. వీరిద్దరు ఇటీవలి జరిగిన ఏసీఏ నార్త్‌జోన్ టోర్నీతో పాటు ఏసీఏ అంతర్‌జోనల్ క్రికెట్ టోర్నీలో మెరుగ్గా రాణించడంతో ఏసీఏ జట్టుకు ఎంపికయ్యారు. ఇందులో క్రాంతికుమార్ మిడిలార్డర్ బ్యాటర్ కమ్ మీడియం పేస్ బౌలర్‌కాగా.. రోహిత్ టాపార్డర్ బ్యాటర్. వీరిద్దరి స్వస్థలాలు టెక్కలి కావడం విశేషం.

సపోర్టింగ్ స్టాఫ్‌గా ఎం.వెంకటరమణ..

గోవాలో జరిగే ఈ అంతర్‌రాష్ట్ర క్రికెట్ టోర్నీలో పాల్గొనే ఆంధ్రా అండర్-14 బాలుర జట్టుకు సపోర్టింగ్ స్టాఫ్‌గా జిల్లాకు చెందిన ఎం.వెంకటరమణ నియమితులయ్యారు. ఈయన గతంలో ఆంధ్రా అండర్-16, 19 జట్లకు కూడా పనిచేసి మెప్పించారు. ఆంధ్రా జట్లకు జిల్లా నుంచి క్రీడాకారుల ఎంపికపై జిల్లా క్రికెట్ సంఘం అధ్యక్ష, కార్యదర్శులు శాస్త్రి, హసన్‌రాజా, మెంటార్ ఇలియాస్ మహ్మద్, కోశాధికారి ఎస్‌ఎం శైలానీ, రవికుమార్, కె.కిరణ్, కోచ్‌లు, సంఘ ప్రతినిధులు, క్రీడాకారుల తల్లిదండ్రులు తదితరులు హర్షం వ్యక్తం చేశారు.

కొబ్బరి క్షేత్రాల పరిశీలన

కవిటి: మండలంలోని శిలగాం, భైరిపురం రెవెన్యూ గ్రామాల పరిధిలో కోకోనట్ డెవలప్‌మెంట్ బోర్డు ద్వారా ఆర్‌అండ్‌ఆర్ పథకానికి ఎంపికైన కొబ్బరిక్షేత్రాల్ని హార్టికల్చర్ డిప్యూటీ డైరెక్టర్ సుజాత గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా కొబ్బరి సస్యరక్షణలో అనుసరిస్తున్న విధివిధానాలపై రైతులను అడిగి తెలుసుకున్నారు. ఆర్.భైరిపురంలో రైతులతో ముఖాముఖీలో పలు సస్యరక్షణ, ఆధునిక పద్ధతుల్ని వివరించారు. కార్యక్రమంలో సీడీబీ డీడీ కుమార్‌వేలు, జిల్లా హార్టికల్చర్ ఆఫీసర్ ఆర్.వి.వి.ప్రసాద్, హెచ్‌ఓ పి.మాధవీలత, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ కడియాల ప్రకాష్, రైతులు పాల్గొన్నారు.



తోటలను పరిశీలిస్తున్న డీడీ సుజాత, వరప్రసాదరావు

● గురుభ్యో నమః






ఈ వాహనంపై ఉన్నవారంతా ఉపాధ్యాయులు. బుడితి జిల్లా ఉన్నత పాఠశాలలో ఒకప్పుడు పని చేశారు. ఈ బడిలో 1991-92లో పదో తరగతి చదివిన వారు గురువారం ఆత్మీయ కలయిక నిర్వహించారు. ఈ సందర్భంగా ఆనాటి ఉపాధ్యాయులను కార్యక్రమానికి స్వాగతించి ఇలా అపురూప రీతిలో గౌరవించారు. బుడితి మార్కెట్ జంక్షన్ నుంచి పూలతో అలంకరించిన ప్రత్యేక వాహనంలో ఊరేగించి పాఠశాల ఆవరణ వరకు తీసుకెళ్లి సత్కరించారు. ఆనాటి జ్ఞాపకాలు గుర్తు చేసుకుని సందడిగా గడిపారు. - సారవకోట

శ్రీకాకులం లెక్కెంతో..?

- నేటి నుంచి జిల్లాలో కుల గణన
- పది రోజుల్లో పూర్తి చేసేందుకు సన్నాహాలు
- 1931 తర్వాత మళ్లీ ఇప్పుడే కులగణన



శ్రీకాకుళం పాతబస్టాండ్:

శ్రీకాకుళంలో కులాల లెక్కలు తేలనున్నాయి. ఏ సామాజిక వర్గంలో ఎంత మంది జనాభా ఉన్నారో స్పష్టంగా తెలియనుంది. జిల్లాలో శుక్రవారం నుంచి కుల గణన ప్రారంభం కానుంది. జనవరి 28 వరకు నిర్వహించనున్న ఈ క్రతువుకు సంబంధించి జిల్లా యంత్రాంగం అన్ని చర్యలు తీసుకుంది. జిల్లాలో 151 కులాలు ఉన్నట్లు భోగట్టా.

1931 తర్వాత..

ఎప్పుడో 1931లో బ్రిటిష్ ప్రభుత్వం కులగణన నిర్వహించింది. ఆ తర్వాత ఎవ్వరూ దాని ఊసెత్తలేదు. మధ్య మధ్యలో పలు రకాల సర్వేలు చేసినా ఉప కులాలు, కులాల పేర్లతో గణన నిర్వహించలేదు. కేవలం బీసీ, ఓసీ, ఎస్సీ, ఎస్టీ ఇలా మాత్రమే గణన చేశారు. మళ్లీ ఇన్నాళ్లకు సంపూర్ణంగా, సమర్థంగా కుల గణన నిర్వహించడానికి ప్రభుత్వం ఏర్పాట్లు చేసింది.

సచివాలయ సిబ్బందితో..

ఈ సారి కులగణన సచివాలయ సిబ్బంది నిర్వహించనున్నారు. వారికి ప్రత్యేకంగా కుల గణనకు సంబంధించిన యాప్‌ను కూడా ప్రభుత్వం రూపొందించి ఇచ్చింది. ఈ యాప్ ఆధారంగానే కుల గణన జరుగుతుంది. వారి పరిధిలో ఉన్న ప్రతి ఇంటి డేటాను ఆ యాప్‌లో ముందుగా పొందుపరుస్తారు. ఆ తర్వాతి వాటిని సరిచేయడం, కుటుంబంలో ఉన్న వ్యక్తుల ఆమోదం తెలియజేయాల్సి ఉంటుంది. ఇందులో రెండు దశలు ఉంటాయి. కార్యక్రమానికి సంబంధించిన డేటా ఒకటో దశలో ఉంటుంది. ఆ కుటుంబం ఇళ్లు, భూములు, ఇతర వివరాలు ఉంటాయి. రెండో దశలో ఆ కుటుంబం కులం, సబ్ క్యాస్టు, మతం, ఇతర వివరాలు నమోదు చేస్తారు. వాటిని సర్వే సిబ్బంది ఆ కుటుంబంలోని వ్యక్తితో ధ్రువీకరించాల్సి ఉంటుంది.

పది రోజుల పాటు..

జిల్లాలో కుల గణన పది రోజుల పాటు నిర్వహించనున్నారు. ఈ నెల 19 నుంచి 28 వరకు చేస్తారు. మరో పది రోజులు గ్రేస్ పీరియడ్ ఉంటుంది. డోర్ లాక్‌లు ఉన్న వారు, వలస వెళ్లిన వారు, వివిధ కారణాల వలన స్థానికంగా లభ్యం కాని వారి వివరాలు తర్వాతి పది రోజుల్లో పూర్తి చేస్తారు. 2016లో జరిగిన సర్వే ఆధారంగా ఇంటి నంబర్లు, ఆ ఇంటిలో ఉన్న కుటుంబ సభ్యుల సంఖ్యలు ఉంటాయి. వాటిలో తొలగింపులు, చేర్పుల ప్రస్తుతం చేసుకునే వెసులుబాటు ఉంది.

అన్ని కులాల గణన



ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లాలో అన్ని తరగతులకు చెందిన కులాల వారీ సంఖ్యను లెక్కించేందుకు జనవరి 19 నుంచి గణనను ప్రారంభించనున్నాం. కుల గణన తర్వాత ప్రజల జీవన ప్రమాణాల మెరుగుదలకు అనుగుణంగా ప్రణాళికలు రూపొందించవచ్చు. కుల గణనలో గ్రామ, వార్డు సచివాలయ సిబ్బంది పాల్గొంటారు. ప్రజా ప్రతినిధులు, సంబంధిత కుల సంఘ నాయకులు పాల్గొని దీనిపై ప్రజలకు అవగాహన కల్పించాలి. ఈ పది రోజుల గణనలో ఇంకా ఎవరైనా మిగిలిపోతే జనవరి 29 నుంచి ఫిబ్రవరి 2 వరకు సచివాలయాలకు వెళ్లి నమోదు చేసుకోవాలి. కార్యక్రమం అనంతరం ఆయా సచివాలయ పరిధిలో 10 శాతం ఇళ్లల్లో రీ వెరిఫికేషన్ చేసి గణన వివరాలను ఫిబ్రవరి 15 వరకు సరిపోల్చి చూస్తాం. - ఎం.నవీన్, ఇన్‌చార్జి కలెక్టర్

ప్రభుత్వ మార్గదర్శకాలు ఇవీ..

- సచివాలయ శాఖ నోడల్ ఏజెన్సీగా ఉంటుంది.
- ఒకే విడతలో కులగణన పూర్తి చేయాలి.
- ఈ నెల 19 నుంచి పది రోజుల్లోగా సర్వే పూర్తి చేయాలి.
- ఎక్కడైనా మిగిలిపోయిన ఇళ్లు ఉంటే తర్వాత పది రోజుల్లో పూర్తి చేయాలి.
- ఇంటింటికీ వెళ్లినప్పుడు ఆధారాల కోసం ఎలాంటి సర్టిఫికెట్లు అడగకూడదు.
- ప్రతి వ్యక్తి పేరు, వయసు, లింగం, భూమి (వ్యవసాయ -వ్యవసాయేతర), ఇంటిలోని పశువులు, వృత్తి, అన్నిరకాలుగా వచ్చే ఆదాయం, కులం, ఉపకులం, మతం, విద్యార్హత, నివాసం ఉండే ఇల్లు, మంచినీటి సదుపాయం, టాయిలెట్లు, గ్యాస్ ఉందా లేదా అనే వివరాలు సేకరించాలి.



కుల గణనపై సర్వత్రా హర్షం



పోతయ్యవలసలో సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి చిత్ర పటానికి క్షీరాభిషేకం చేస్తున్న దృశ్యం

నరసన్నపేట: ఇచ్చిన మాట ప్రకారం రాష్ట్రంలో శుక్రవారం నుంచి కుల గణనను ప్రభుత్వం చేపట్టడాన్ని స్వాగతిస్తూ అన్ని కులాలు హర్షం వ్యక్తం చేస్తున్నాయి. ఏ కులం జనాభా ఎంత ఉందనేది దీని ద్వారా స్పష్టం అవుతుందని, ఇలాంటి సాహసోపేత నిర్ణయం తీసుకొని పక్కాగా అమలు చేస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికి అన్ని కులాల వారు అభినందిస్తున్నారు. పోతయ్యవలసలో అరవకుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో సీఎం చిత్ర పటానికి గురువారం క్షీరాభిషేకం చేశారు. అరవకుల సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రతినిధి కసపల అరవింద నాయుడు మాట్లాడుతూ తమలాంటి చిన్నకులాలకు ప్రభుత్వం ఎంతో గుర్తింపు నిచ్చిందని, ఇప్పుడు చిన్న కులాల జనాభా కూడా స్పష్టంగా నిర్ధారణ కానుందని తెలిపారు. బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ కులాలతో పాటు అన్ని వర్గాలు ముఖ్యమంత్రికి అండగా ఉండాలని కోరారు. కార్యక్రమంలో కర్రి సురేష్, అరవల రాజా, గదిలి రామ్మోహన్, ఎలిపోతు కృష్ణారావు, అరవల శ్రీనివాస్, అరవల సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

సమష్టి కృషితో ముందుకువెళ్దాం

- ప్రొఫెసర్ కేఆర్ రజిని
- బీఆర్‌ఏయూ నూతన వీసీగా బాధ్యతల స్వీకరణ



బాధ్యతలు స్వీకరిస్తున్న వైస్ చాన్స్‌లర్ ప్రొఫెసర్ కేఆర్ రజిని

ఎచ్చెర్ల క్యాంపస్: సమష్టి కృషితో వర్సిటీని ముందుకు తీసుకెళ్దామని బీఆర్ అంబేడ్కర్ యూనివర్సిటీ నూతన వైస్ చాన్స్‌లర్ ప్రొఫెసర్ కేఆర్ రజిని పిలుపునిచ్చారు. ఆమెకు గురువారం వర్సిటీలో ఉద్యోగులు ఘన స్వాగతం పలికారు. ముందుగా అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి అనంతరం ఆమె బాధ్యతలు స్వీకరించారు. అంబేడ్కర్ వంటి మహనీయుని పేరుపై ఉన్న విశ్వ విద్యాలయానికి వీసీగా బాధ్యతలు అప్పగించిన ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. ప్రమాణాలతో కూడిన విద్య అందించటం, వర్సిటీ ద్వారా ప్రాంతీయ అభివృద్ధి లక్ష్యంగా పనిచేస్తామని వెల్లడించారు. కుల, మత , వర్గ, రాజకీయాలకు ఇక్కడ తావు ఉండదని, వర్సిటీ అనే కుటుంబంలో ప్రతి ఉద్యోగి చిత్తశుద్ధి, అంకిత భావం, నిజాయితీగా పనిచేయాలని తెలిపారు. మంచి ఫలితాలు రావాలంటే అకడమిక్ కరిక్యులమ్‌లో మార్పులు అవసరమని చెప్పారు. అనంతరం వర్సిటీలో అన్ని విభాగాల పరిస్థితి, పరిపాలన, భవన నిర్మాణాలు వంటి అంశాలపై అధికారులతో సమీక్షించారు. ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధుల సహకారంతో వర్సిటీని ప్రగతి పథంలో నడిపిస్తానని, వర్సిటీలో మహిళా సాధికారితకు కృషిచేస్తున్నట్లు వివరించారు. రిజిస్ట్రార్ ప్రొఫెసర్ బిడ్డిక అడ్డయ్య, అధికారులు, సిబ్బంది వీసీకి అభినందనలు తెలిపారు.

నవోదయ ప్రవేశ పరీక్ష రేపు



సరుబుజ్జిలి: వెన్నెలవలస జవహర్ నవోదయ విద్యాలయంలో 2024-25 విద్యా సంవత్సరానికి గాను 6వ తరగతిలో ప్రవేశానికి సంబంధించి ప్రవేశ పరీక్ష ఈనెల 20న నిర్వహించనున్నట్లు విద్యాలయం ప్రిన్సిపాల్ డి.పరశురామయ్య గురువారం ఓ ప్రకటనలో వెల్లడించారు. ప్రవేశ పరీక్ష ఉదయం 11.30 నుంచి 1.30 వరకు నిర్వహిస్తామని, పరీక్ష కేంద్రానికి గంట ముందు చేరుకోవాలని సూచించారు. పరీక్ష కోసం 8430 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకున్నట్లు తెలిపారు. విద్యార్థులు పరీక్ష సమయంలో తమ ఆధార్‌కార్డు/ రెసిడెన్స్ ధ్రువీకరణ పత్రం, అట్ట, బ్లూ లేదా బ్లాక్‌పెన్‌తో హాజరు కావాలని సూచించారు.

23,948 మందికి ▶ రూ.2.57 కోట్లు



లబ్ధిదారులకు చెక్కును అందజేస్తున్న ఇన్‌చార్జి కలెక్టర్ ఎం.నవీన్, హౌసింగ్ పీడీ గణపతి

- వడ్డీ రీయింబర్స్‌మెంట్ నిధులు విడుదల

శ్రీకాకుళం పాతబస్టాండ్: జగనన్న ఇల్లు నిర్మించుకుంటున్న వారికి పావలా వడ్డీకే రుణాలు అందజేస్తూ ఆ వడ్డీ భారాన్ని ప్రభుత్వమే భరిస్తోంది. జిల్లాలో తొలి విడతలో అర్హులైన 23,948 మంది లబ్ధిదారులకు వడ్డీ రీయింబర్స్‌మెంటు కింద రూ.2.57 కోట్లను ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి విడుదల చేశారని ఇన్‌చార్జి కలెక్టర్ ఎం.నవీన్ తెలిపారు. తాడేపల్లి క్యాంపు కార్యాలయం నుంచి గురువారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సీఎం వైఎస్ జగన్ 'నవరత్నాలు-పేదలందరికీ ఇళ్లు' లబ్ధిదారులకు వడ్డీ రీయింబర్స్‌మెంట్ కార్యక్రమం నిర్వహించారు. జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లో వీసి నిర్వహించగా.. ఆ కార్యక్రమంలో ఇన్‌చార్జి కలెక్టర్ నవీన్ మాట్లాడుతూ జిల్లాలో 62,463 మంది వివిధ స్వయం సహాయక సంఘాల్లోని మహిళలు తమ ఇంటి నిర్మాణం రుణం తీసుకున్నారని, వారిలో తొలి దశలో 23,948 మందికి వడ్డీ రీయింబర్స్‌మెంట్‌ను గురువారం అందజేశామని, మిగిలిన వారికి రెండో దశలో అందజేస్తామన్నారు. బ్యాంకు నుంచి పొందిన రుణాలకు వడ్డీని కూడా రీయింబర్స్‌మెంట్ చేయడంపై లబ్ధిదారులు ఆనందం వ్యక్తం చేస్తున్నారని చెప్పారు.

ఇంటి నిర్మాణానికి యూనిట్‌కు రూ.1.80 లక్షలు చొప్పున ఇవ్వడమే కాకుండా, ఉచితంగా ఇసుక సరఫరా ద్వారా రూ.15 వేలు, సిమెంట్, స్టీలు, మెటల్ ఫ్రేమ్స్, ఇతర నిర్మాణ సామగ్రిని తక్కువ ధరకే అందించడంతో మరో రూ.40 వేల మేర లబ్ధి కల్పిస్తున్నామని, పావలా వడ్డీకే రూ.35వేలు చొప్పున బ్యాంకు రుణం అందించడం ద్వారా ఇలా మొత్తంగా ఒక్కో లబ్ధిదారుకు రూ.2.70 లక్షలు చొప్పున లబ్ధి చేకూరిందని నవీన్ వివరించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా గృహ నిర్మాణ సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ నక్క గణపతి రావు, ఈఈ పి.రఘురాం, డిప్యూటీ ఈఈలు కె.అప్పారావు, జి.రమణమూర్తి, పలు మండలాల నుంచి లబ్ధిదారులు పాల్గొన్నారు.

అంబేడ్కర్ రుణం తీర్చుకోలేనిది

- వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు ధర్మాన కృష్ణదాస్



కార్యక్రమంలో మాట్లాడుతున్న ధర్మాన కృష్ణదాస్. చిత్రంలో ఇన్‌చార్జి కలెక్టర్ నవీన్ తదితరులు

శ్రీకాకుళం రూరల్:

ఆకాశమంత విగ్రహం తయారు చేసినా అంబేడ్కర్ రుణం తీర్చుకోలేమని వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, నరసన్నపేట ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్ అన్నారు. విజయవాడలోని అంబేడ్కర్ విగ్రహావిష్కరణ నేపథ్యంలో సామాజిక సమతా సంకల్ప కార్యక్రమాన్ని స్థానిక అంబేడ్కర్ ఆడిటోరియంలో గురువారం నిర్వహించారు. కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ విజయవాడలోని స్వరాజ్య మైదానంలో 19 ఎకరాల విస్తీర్ణంలో రూ.404 కోట్ల వ్యయంతో ఏర్పాటు చేసిన సామాజిక న్యాయ శిల్పాన్ని ప్రతి ఒక్కరూ సందర్శించాలని పిలుపునిచ్చారు. ఎంతో స్ఫూర్తిని కలిగించేలా ఉత్తర, దక్షిణాది రాష్ట్రాలకు వారధిగా, ఆంధ్రప్రదేశ్ నడిబొడ్డున ఉన్న విజయవాడ నగరంలో సామాజిక న్యాయానికి నిలువెత్తు రూపంలా దర్శనమిస్తుందని తెలిపారు.

జిల్లా ఇన్‌చార్జి కలెక్టర్ ఎం.నవీన్ మాట్లాడుతూ ప్రపంచంలోనే అత్యున్నత రాజ్యాంగాన్ని రూపొందించిన భారతరత్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ నిర్దేశించిన మార్గంలో అంతా నడవాలని సూచించారు. హక్కులు, అభ్యున్నతి కోసం పాటుపడిన అంబేడ్కర్‌కు 206 అడుగుల ఎత్తైన విగ్రహం ఏర్పాటు చేయడం స్ఫూర్తిదాయకమన్నారు. అనంతరం మంత్రి ధర్మాన ప్రసాదరావు పంపిన సందేశాన్ని చదివి వినిపించారు. సమాచార శాఖ ఆధ్వర్యంలో అంబేడ్కర్ గొప్పదనం తెలిపే ఆయన జీవిత చరిత్ర, స్మృతివనం ఫొటోలతో కూడిన ఎగ్జిబిషన్‌ను ధర్మాన కృష్ణదాస్‌తో కలిసి ప్రారంభించారు. అలాగే ఆంధ్రప్రదేశ్ ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ సంఘ డైరీని కూడా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా దళిత సంఘాల నేతలతో కలిసి అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

కార్యక్రమంలో జిల్లా సాంఘిక, సంక్షేమ శాఖ ఉపసంచాలకులు విశ్వమోహన్‌రెడ్డి, బీసీ కార్పొరేషన్ ఈడీ గడ్డెమ్మ, డ్వామా పీడీ చిట్టిరాజు, దళిత సంఘ నాయకులు బొడ్డేపల్లి నర్సింహులు, పొన్నాడ రుషి, కళ్లేపల్లి రామ్‌గోపాల్, కంతవేణు, ముంజేటి కృష్ణమూర్తి, బోనెల రమేష్, తైక్వాండో శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

అంబేడ్కర్ విగ్రహావిష్కరణ నూతన అధ్యాయం

- రెవెన్యూ మంత్రి ధర్మాన ప్రసాదరావు



అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి మాట్లాడుతున్న మంత్రి ధర్మాన ప్రసాదరావు

శ్రీకాకుళం (పీఎన్ కాలనీ): రాష్ట్రంలో బీఆర్ అంబేడ్కర్ అతిపెద్ద విగ్రహావిష్కరణ మరో నూతన అధ్యాయం కానుందని రెవెన్యూశాఖ మంత్రి ధర్మాన ప్రసాదరావు అన్నారు. ఆయన గురువారం అంబేడ్కర్ విగ్రహానికి నివాళులర్పించారు. అనంతరం మీడియాతో మాట్లాడారు. ప్రపంచంలోనే అత్యంత ఎత్తైన అంబేడ్కర్ విగ్రహం స్టీల్, ఇత్తడి లోహాలతో తయారు చేసినట్లు పేర్కొన్నారు. ఐదేళ్ల కిందట వైఎస్ జగన్ తన పాదయాత్రలో మాట ఇచ్చారని, ఆ మేరకు విజయవాడలో నది ఒడ్డున ఈ విగ్రహాన్ని ఏర్పాటుచేసి ఆవిష్కరించే కార్యక్రమం శుక్రవారం జరుగుతుందన్నా రు. భారతదేశాన్ని సరైన మార్గంలో నడిపించడానికి విధానాలను, చట్టాన్ని, రాజ్యాంగాన్ని తయారు చేసిన మహోన్నతమైన వ్యక్తి అంబేడ్కర్ అని కొనియాడారు. ఆ కాలంలో సమాజాన్ని ముందుకు నడిపించడానికి రామాయణాన్ని, భారతాన్ని ప్రామాణికంగా తీసుకునేవారని, కానీ ఆధునిక భారతదేశాన్ని నడిపించడానికి అంబేడ్కర్ రాజ్యాంగాన్ని ప్రామాణికంగా తీసుకుంటున్నామని తెలిపారు. శుక్రవారం విజయవాడలో జరగబోయే ఈ కార్యక్రమంలో అన్ని వర్గాల ప్రజలు పాల్గొనాలని కోరారు. కార్యక్రమంలో తూర్పుకాపు, కళింగవైశ్య కార్పొరేషన్ చైర్మన్లు మామిడి శ్రీకాంత్, అంధవరపు సూరిబాబు, వైఎస్సార్‌సీపీ ఎస్సీసెల్ విభాగం జిల్లా అధ్యక్షుడు పొన్నాడ రుషి, ఎస్సీ కమిషన్ మెంబర్ కంత వేణు, కళ్లేపల్లి రాంగోపాల్, సాధు వైకుంఠ రావు, బలగ గణపతిపట్నాయక్, జేఎం శ్రీనివాస్, టంకాల బాలకృష్ణ, గుంట జ్యోతి, యజ్జల గురుమూర్తి తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

లారీలో మంటలు



మంటలను అదుపు చేస్తున్న హైవే సిబ్బంది

కాశీబుగ్గ: రహదారిపై ప్రయాణిస్తున్న లారీ నుంచి మంటలు చెలరేగిన ఘటన లక్ష్మీపురం జాతీయ రహదారి టోల్‌గేటుకు కిలోమీటరు దూరంలో గురువారం జరిగింది. లారీ అనంతగిరి పంచాయతీ వెంకటాపురం గ్రామ సమీపంలో ఓవర్‌బ్రిడ్జి దిగుతుండగా బ్రేకులపై అధిక ఒత్తిడి కలగడంతో మంటలు చెలరేగి లారీకి అంటుకున్నాయి. అప్రమత్తమైన ఇతర వాహనదారులు డ్రైవర్‌కు సమాచారం ఇవ్వడంతో లారీ ఆపి 1033కు కాల్ చేశారు. అయి తే వెంటనే టోల్ సిబ్బంది చేరుకుని ఫైర్ సిలిండర్‌తో మంటలను నియంత్రించారు. పలాసకు చెందిన అగ్నిమాపక కేంద్రం సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని మంటలను పూర్తి స్థాయిలో అదుపు శారు.

కేసుల దర్యాప్తుపై సమీక్ష



సమీక్షలో మాట్లాడుతున్న ఎస్పీ రాధిక

శ్రీకాకుళం క్రైమ్ : గ్రేవ్ కేసులలో నిశితమైన సాక్ష్యాధారాలతో దర్యాప్తు వేగవంతం చేయాలని ఎస్పీ జీఆర్ రాధిక పోలీసు అధికారులను ఆదేశించారు. గురువారం జిల్లా పోలీసు కార్యాలయంలో గత నెలలో నమోదైన గ్రేవ్ కేసులైన ప్రాపర్టీ, హత్య, మానభంగం, ఎస్సీ, ఎస్టీ, పోక్సో కేసుల గురించి సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ముందుగా ఈ కేసుల దర్యాప్తు, ఆస్తి సంబంధిత నేరాల్లో ప్రాపర్టీ రికవరీ, ముద్దాయిల అరెస్టులపై సర్కిల్ వారీ అధికారులను అడిగి తెలుసుకున్నారు. కేసుల పూర్వాపరాలపై ఆరా తీసి హత్య కేసులు, పోక్సో, రేప్, ప్రాపర్టీ కేసుల నియంత్రణకు చర్యలు చేపట్టాలన్నారు. గత నెలలో కేసుల దర్యాప్తు స్థాయి, ప్రస్తుత కేసుల దర్యాప్తు పురోగతి క్షుణ్ణంగా పరిశీలించారు. ప్రాపర్టీ కేసుల్లో కచ్చితమైన ఆధారాలతో దర్యాప్తు చేయాలని, కేసుల నమోదు, నిందితుల అరెస్టు, దర్యాప్తు, చార్జిషీటు దాఖలు వరకు సమగ్రమైన విచారణ చేయాలని సూచించారు. దర్యాప్తు వేగవంతం చేసి కోర్టులో అభియోగపత్రాలు వీలైనంత వే గంగా దాఖలు చేయాలని సూచించారు. పాత నేరస్తులపై నిఘా పెట్టి వారి ఉనికిని తెలుసుకోవాలన్నారు. నైట్ బీట్స్ బలోపేతం చేసి అధికారులు తనిఖీలు నిర్వహించాలని, ముఖ్య కూ డళ్లు, బ్యాంకులు, వ్యాపార సముదాయాలు వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలన్నారు. రానున్న ఎన్నికల నేపథ్యంలో సరిహద్దుల చెక్ పోస్టుల వద్ద ముమ్మర తనిఖీలు నిర్వహించాలని, అక్రమ మద్యం, నగదు తరలింపులు లేకుండా పటిష్ట చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ జె.తిప్పేస్వామి, డీఎస్పీలు బి.బాలచంద్రారెడ్డి, వై.శృతి, నాగేశ్వరరెడ్డి, ఎస్.వాసుదేవ్, సీహెచ్‌జీవీ ప్రసాదరావు, విజయ్‌కుమార్, జిల్లా వ్యాప్తంగా ఉన్న సర్కిల్ ఇన్‌స్పెక్టర్లు పాల్గొన్నారు.

రద్దీగా రైల్వే రిజర్వేషన్ కౌంటర్



ప్రయాణికులతో రద్దీగా ఉన్న రైల్వే రిజర్వేషన్ కౌంటర్

ఆమదాలవలస రూరల్: పండగ సందడి ముగిసింది. ఎక్కడెక్కడి నుంచో సొంతూరికి వచ్చిన వారంతా ఇప్పుడు తిరుగుముఖం పట్టారు. దీంతో రైల్వేస్టేషన్లు రద్దీగా కనిపిస్తున్నాయి. రిజర్వేషన్ చేసుకోవడానికి వచ్చిన ప్రయాణికులతో ఆమదాలవలస (శ్రీకాకుళం రోడ్డు) రైల్వేస్టేషన్ గురువారం రద్దీగా మారింది. రైళ్ల బెర్తులు ఖాళీ లేక అన్ని వెయిటింగ్ లిస్టులే దర్శనమిస్తున్నాయి. సికింద్రాబాద్, విజయవాడ, నెల్లూ రు, గుంటూరు, కర్నూల్, బెంగళూర్, చెన్నై, ముంబై వంటి ప్రాంతాలకు వెళ్లేందుకు టిక్కెట్లు కోసం ఉదయం నుంచే లైన్లు కడుతున్నారు.

ప్రీ పబ్లిక్‌కు సన్నద్ధం



పరీక్షలకు సన్నద్ధమవుతున్న ఇంటర్ విద్యార్థులు

- నేటి నుంచి ఇంటర్మీడియెట్ విద్యార్థులకు ప్రీ పబ్లిక్ పరీక్షలు
- ఐపీఈ-2023 పరీక్షల ప్రశ్న పత్రాలతో నిర్వహణ
- పకడ్బందీగా ఏర్పాట్లు చేసిన ఇంటర్ విద్య అధికారులు



ఇంటర్మీడియెట్ బోర్డు జిల్లా ఆర్ఐఓ కార్యాలయం

శ్రీకాకుళం న్యూకాలనీ: ఇంటర్మీడియెట్ ప్రీ పబ్లిక్ పరీక్షలకు రంగం సిద్ధమైంది. పబ్లిక్ పరీక్షలు మార్చి ఒకటో తేదీ నుంచి మొదలుకానున్న నేపథ్యంలో ఈలోగా ముందస్తుగా ప్రీ పరీక్షలను నిర్వహించి విద్యార్థులను పూర్తి స్థాయిలో సిద్ధం చేయాలని ఇంటర్‌బోర్డు అధికారులు భావించారు. ఇందులో భాగంగా శుక్రవారం నుంచి మొదలయ్యే ప్రీపబ్లిక్ పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి చేశారు.

ఉదయం ఫస్టియర్, మధ్యాహ్నం సెకెండియర్..

ప్రీ పబ్లిక్ పరీక్షలను ఒక నిర్దిష్టమైన షెడ్యూల్ ప్రకారం నిర్వహించేందుకు ఇంటర్మీడియెట్ బోర్డు ఇప్పటికే మార్గదర్శకాలు జారీ చేసింది. ప్రధానమైన జనరల్ కోర్సుల పరీక్షలు జనవరి 19 నుంచి 25వ తేదీ వరకు జరుగుతాయి. ప్రతిరోజు ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ప్రథమ సంవత్సరం విద్యార్థులకు, మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు ఈ పరీక్షలను నిర్వహించనున్నారు. పరీక్షలు ముగిసిన తర్వాత దిద్దుబాటు చేయనున్న మార్కులను సంబంధిత సీఎంఆర్ రికార్డుల్లోను, జ్ఞానభూమి వెబ్‌పోర్టల్‌లోను నమోదు చేయనున్నారు.

ఇంటర్‌బోర్డు ప్రశ్న పత్రంతో..

2022-2023 ఇంటర్ పబ్లిక్ పరీక్షలు గత ఏడాది మార్చి నెలలో, సప్లిమెంటరీ పరీక్షలను జూన్‌లో నిర్వహించిన విషయం తెలిసిందే. మొత్తం మూడు సెట్ల ప్రశ్న పత్రాల్లో రెండింటిని వినియోగించగా.. ఒక సెట్ మిగిలింది. మిగిలిన ఆ ఒక సెట్ ప్రశ్న పత్రాన్ని ఈ ప్రీపబ్లిక్ పరీక్షలకు వినియోగించాలని ఇంటర్‌విద్య కమిషనర్ సౌరభ్ గౌర్ ఆదేశాలు జారీ చేశారు. కమిషనర్ ఆదేశాల మేరకు జిల్లా ఇంటర్మీడియెట్ విద్య డీవీఈఓ కోట ప్రకాశరావు, ఆర్ఐఓ ప్రగడ దుర్గారావు ఇప్పటికే ప్రభుత్వ కళాశాలల ప్రిన్సిపాళ్లకు ఆదేశాలు జారీ చేశారు. ప్రశ్నాపత్రాలను కళాశాలలకు చేర్చారు.

జిల్లాలో ఇదీ పరిస్థితి..

జిల్లాలో అన్ని యాజమాన్యాల పరిధిలో జూనియర్ కళాశాలలు 191 ఉన్నాయి. అయితే వీటిలో ఫంక్షనింగ్ జరుగుతున్న కళాశాలలు 172 ఉన్నాయి. ఇందులో ప్రభుత్వ జూనియర్ కళాశాలలు 38, సోషల్ వెల్ఫేర్ 9, ట్రైబల్ వెల్ఫేర్ 1, మోడల్ స్కూల్/కళాశాలలు 13, కేజీబీవీలు 25, జెడ్పీహెచ్ స్కూల్ కాలేజీలు 5, కో ఆపరేటివ్ 2, మిగిలినవన్నీ ప్రైవేటు కళాశాలలే. వీటిల్లో మొత్తం 49,607 మంది విద్యార్థులు ఇంటర్మీడియెట్ చదువుతున్నారు. ఇందులో ప్రథమ సంవత్సరం 25258 మంది, ద్వితీయ సంవత్సరం 24349 మంది చదువుతున్నారు. వీరంతా ఈ పరీక్షలను రాయనున్నారు.

పకడ్బందీగా పరీక్షలు జరపాలి



జిల్లాలో నేటి నుంచి మొదలయ్యే ప్రీ పబ్లిక్ పరీక్షలను పక్కాగా పకడ్బందీగా జరిపించేలా ఆదేశాలు జారీ చేశాం. జిల్లాలో అన్ని యాజమాన్యాల జూనియర్ కాలేజీల్లో పరీక్షలు జరగనున్నాయి. స్టోరేజ్ పాయింట్ల నుంచి ప్రశ్న పత్రాలను కళాశాలలకు చేరవేశాం. పరీక్షల తీరుపై కళాశాలల్లో తనిఖీలు చేస్తాం.
– ప్రగడ దుర్గారావు, జిల్లా ఆర్ఐఓ, ఇంటర్మీడియెట్ బోర్డు

బోర్డు ప్రశ్న పత్రాలను వినియోగిస్తున్నాం



ఇంటర్ ప్రీ పబ్లిక్ పరీక్షలు ఏర్పాట్లు పూర్తిచేశాం. ఉదయం ఫస్టియర్స్‌కు, మధ్యాహ్నం సెకెండియర్ వారికి పరీక్షలు జరుగుతాయి. ఐపీఈ-2023 ఇంటర్‌బోర్డు ప్రశ్న పత్రాల సెట్‌ను వినియోగిస్తున్నాం. ఇందుకు సంబంధించి ప్రిన్సిపాళ్లకు తగు మార్గదర్శకాలను జారీ చేయడం జరిగింది. జవాబుపత్రాలను వెంటనే దిద్దుబాటు చేసి ఈనెలాఖరులోగా మార్కులను జ్ఞానభూమి వెబ్‌పోర్టల్‌లో నమోదుచేయాలి. – కోట ప్రకాశరావు, జిల్లా డీవీఈఓ, ఇంటర్మీడియెట్ విద్య

175/175 సీట్ల గెలుపే లక్ష్యం



మాట్లాడుతున్న వైఎస్సార్ సీపీ రీజనల్ కో-ఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డి. చిత్రంలో డిప్యూటీ సీఎం పీడిక రాజన్నదొర, మంత్రులు బొత్స సత్యనారాయణ, ధర్మాన ప్రసాదరావు, గుడివాడ అమర్‌నాథ్, సీదిరి అప్పలరాజు, పార్టీ జిల్లాల అధ్యక్షులు కోలా గురువులు, ధర్మాన కృష్ణదాస్

- వైఎస్సార్ సీపీ రీజనల్ కోఆర్డినేటర్ వై.వి.సుబ్బారెడ్డి, మంత్రి బొత్స సత్యనారాయణ
- ఈ నెల 25న భీమిలిలో బహిరంగ సభ
- సభ నిర్వహణపై పార్టీ ముఖ్యనేతలతో సమావేశం

సాక్షి, విశాఖపట్నం : వచ్చే ఎన్నికల్లో రాష్ట్రంలోని అన్ని నియోజకవర్గాల్లో గెలుపే లక్ష్యంగా వైఎస్సార్ సీపీ ప్రణాళికలు రచిస్తోంది. ఇందులో భాగంగా ఉత్తరాంధ్ర నుంచి ఎన్నికల శంఖారావం పూరించాలని నిర్ణయించింది. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి అధ్యక్షతన ఉత్తరాంధ్ర జిల్లాలకు సంబంధించి ఈ నెల 25న భీమిలిలో భారీ బహిరంగ సభ నిర్వహించనుంది. ఈ సభ నిర్వహణపై గురువారం ఎండాడలోని పార్టీ కార్యాలయంలో వైఎస్సార్ సీపీ రీజనల్ కో-ఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డి, మంత్రి బొత్స సత్యనారాయణ అధ్యక్షతన ఉత్తరాంధ్ర జిల్లాల మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, సమన్వయకర్తలు, నియోజకవర్గ ఇన్‌చార్జులు, ముఖ్య నేతలతో గురువారం కీలక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వైవీ సుబ్బారెడ్డి మాట్లాడుతూ ఉత్తరాంధ్ర నుంచే వైఎస్సార్ సీపీ ఎన్నికల ప్రచారం ప్రారంభకానుందని, ఇందులో భాగంగా భీమిలిలో నిర్వహించే భారీ బహిరంగ సభ దద్దరిల్లాలని పిలుపునిచ్చారు. ఉత్తరాంధ్ర జిల్లాల నుంచి పెద్ద ఎత్తున పార్టీ శ్రేణులు, నాయకులు సభకు తరలిరావాలన్నారు. ఈ సభలో వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో ఉత్తరాంధ్రలో జరిగిన అభివృద్ధి, సంక్షేమాన్ని ముఖ్యమంత్రి ప్రజలకు వివరిస్తారన్నారు. మంత్రి బొత్స సత్యనారాయణ మాట్లాడుతూ రాష్ట్రాన్ని ఐదు జోన్లుగా విభజించామని.. సీఎం జగన్ అధ్యక్షతన అన్ని జోన్లలో కేడర్‌తో సమావేశాలు జరుగుతాయని వెల్లడించారు. వచ్చే ఎన్నికలకు పార్టీ కేడర్‌ను సన్నద్ధం చేయడమే లక్ష్యంగా ఈ భేటీలు జరుగుతాయని వెల్లడించారు. తొలి బహిరంగ సభ ద్వారా ఉత్తరాంధ్ర కార్యకర్తలు, అభిమానులకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్ దిశానిర్దేశం చేస్తారన్నారు. ఉత్తరాంధ్రపై సీఎం జగన్‌కు ప్రత్యేక శ్రద్ధ ఉందని, అందుకే ఈ ప్రాంతం నుంచి ఎన్నికల శంఖారావం పూరిస్తున్నట్లు వివరించారు. ఎవరికి ఎమ్మెల్యే.. ఎవరికి ఎంపీ టికెట్ ఇవ్వాలన్నది ముఖ్యమంత్రి నిర్ణయిస్తారని చెప్పారు.

కార్యక్రమంలో డిప్యూటీ సీఎం పీడిక రాజన్నదొర, మంత్రులు ధర్మాన ప్రసాదరావు, సీదిరి అప్పలరాజు, గుడివాడ అమర్‌నాథ్, డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి, ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ, ఎంపీలు ఎంవీవీ సత్యనారాయణ, భీశెట్టి వెంకట సత్యవతి, బెల్లాన చంద్రశేఖర్, ఎమ్మెల్సీలు దువ్వాడ శ్రీనివాస్, వర్రు రామారావు, ఇందుకూరి రఘురామరాజు, సురేష్ బాబు, పార్టీ జిల్లాల అధ్యక్షులు కోలా గురువులు, ధర్మాన కృష్ణదాస్, పరీక్షిత్‌రాజు, చెట్టి పాల్గుణ, ఎమ్మెల్యేలు ముత్తంశెట్టి శ్రీనివాసరావు, గొర్లె కిరణ్ కుమార్, శంబంగి వెంకట చిన అప్పలనాయుడు, బడుకొండ అప్పలనాయుడు, బొత్స అప్పలనర్సయ్య, కడుబండి శ్రీనివాసరావు, విశ్వసరాయి కళావతి, పాముల పుష్ప శ్రీవాణి, అలజంగి జోగారావు, వాసుపల్లి గణేష్‌కుమార్, అన్నంరెడ్డి అదీప్ రాజ్, కంబాల జోగులు, పెట్ల ఉమాశంకర్ గణేష్, కె.భాగ్యలక్ష్మి, తిప్పల నాగిరెడ్డి, గొల్ల బాబూరావు, శ్రీకాకుళం పార్లమెంట్ నియోజకవర్గ ఇన్‌చార్జి పేరాడ తిలక్, నియోజకవర్గ సమన్వయకర్తలు, ఇన్‌చార్జిలు కె.కె.రాజు, ఆడారి ఆనంద్‌కుమార్, పిరియా విజయ, డాక్టర్ తాలే రాజేష్, మత్స్యరాస విశ్వేశ్వరరాజు, ఉరుకూటి రామచంద్రరావు, మలసాల భరత్‌కుమార్, ముఖ్య నాయకులు సుకుమార్‌వర్మ, ఈర్లె అనురాధ, తమ్మినేని చిరంజీవి, కార్పొరేషన్ చైర్మన్లు పాల్గొన్నారు.

22న తుది ఓటర్ల జాబితా విడుదల



సమావేశంలో మాట్లాడుతున్న ఎన్నికల పరిశీలకులు శ్యామలరావు

శ్రీకాకుళం పాతబస్టాండ్: ఓటర్ల తుది జాబితాను 22వ తేదీన విడుదల చేయనున్నట్లు ఓటర్ల జాబితా జిల్లా ప్రత్యేక పరిశీలకులు జె.శ్యామలరావు వెల్లడించారు. ఆయన గురువారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ఇన్‌చార్జి కలెక్టర్ ఎం.నవీన్, టెక్కలి సబ్ కలెక్టర్, ఆర్డీఓలు జిల్లాలోని ఈఆర్వోలు, ఏఈఆర్వోలతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పబ్లికేషన్‌ను అందరు ఎలక్టోరల్స్ పరిశీలించుకునే విధంగా తగు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. గ్రామస్తులు తమ పేర్లను జాబితాలో పరిశీలన చేసుకునేందుకు ఏర్పాట్లు చేయాలన్నారు. ఎపిక్ కార్డులు అందరికీ చేరేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. వివిధ రాజకీయ పార్టీల నుంచి వచ్చిన ఫిర్యాదులకు తీసుకున్న చర్యలను రాజకీయ పార్టీలకు తెలియజేయాలన్నారు. జిల్లాలో ఉన్న పోలింగ్ కేంద్రాల వద్ద మరుగుదొడ్లు, విద్యుత్, తదితరమైన సదుపాయాలు ఉన్నాయా లేదా, అక్కడ ఉండే సమస్యలు పరిష్కారం చేసిందీ లేనిదీ అడిగి తెలుసుకున్నారు. తొలగింపులు, చేర్పులకు సంబంధించి ఎవరైనా బల్క్‌గా దరఖాస్తులు ఇచ్చినా అలాంటి వారిని గుర్తించి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. సమావేశంలో టెక్కలి సబ్ కలెక్టర్ నూరుల్ కమర్, జిల్లా రెవెన్యూ అధికారి ఎం.గణపతిరావు, ఆర్డీఓలు, డాక్టర్ ఎస్.భరత్ నాయక్, సీహెచ్ రంగయ్య, ఉప కలెక్టర్లు బి.పద్మావతి, జి.జయదేవి జిల్లాలోని ఆయా మండలాల తహసీల్దార్లు, డీటీలు, తదితరులు పాల్గొన్నారు.

అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఇన్‌చార్జి కలెక్టర్ ఎం.నవీన్ మాట్లాడుతూ పోలింగ్ కేంద్రాల వద్ద ఇప్పటి వరకు మరుగుదొడ్లు, విద్యుత్, ర్యాంప్స్, తాగునీరు, తదితర సౌకర్యాలు లేకపోతే తక్షణమే ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. స్కూల్స్, తదితర వాటి వద్ద సమస్యలు ఏమైనా ఉంటే సంబంధిత అధికారులకు తెలియజేసి చర్యలు చేపట్టాలన్నారు. నిధులకు సమస్య లేదన్నారు. రీ సర్వే త్వరితగతిన చేపట్టాలని ఆదేశించారు. మండలాల్లో సమస్యలుంటే సంబంధిత ఆర్డీఓలు ద్వారా తెలియజేయాలని ఆదేశించారు.

‘అభ్యసన సామర్థ్యాలు మెరుగయ్యాయి’



సర్వే పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న ప్రిన్సిపాల్ సూర్యచంద్రరావు, పక్కనే ప్రథమ్ ప్రతినిధులు

శ్రీకాకుళం న్యూకాలనీ: ప్రభుత్వం విద్యాభివృద్ధికి పెద్దపీట వేస్తోందని, గతంతో పోలిస్తే విద్యార్థుల్లో అభ్యసన సామర్థ్యాలు మెరుగయ్యాయని శ్రీకాకుళం ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కింతలి సూర్యచంద్రరావు పేర్కొన్నారు. ఏటా ఏఎస్ఈఆర్ 2023 సర్వేను 5 నుంచి 16 ఏళ్ల గల గ్రామీణప్రాంత విద్యార్థుల చదువు, అభ్యసన స్థితిగతులపై నిర్వహిస్తుంటారు. ఈ ఏడాది ప్రథమ ఆర్గనైజేషన్ వారు 14 నుంచి 18 ఏళ్ల వయస్సు కలిగిన విద్యార్థులపై ఈ సర్వేను నిర్వహించారు. ఈ సర్వేలో శ్రీకాకుళం ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల నుంచి 2019 నుంచి చదువుతున్న విద్యార్థులు పాల్గొన్నారు. సర్వే నివేదికను గురువారం ఢిల్లీలో విడుదల చేయగా.. కార్యక్రమంలో పాల్గొన్న ప్రిన్సిపాల్ డాక్టర్ సూర్యచంద్ర మాట్లాడుతూ ఈ నివేదిక ప్రకారం శ్రీకాకుళం జిల్లాలో ఉన్నత చదువుల కోసం 14 నుంచి 18ఏళ్ల వయస్సు కలిగిన యువత 93.3 శాతం మంది గుర్తింపు కలిగిన విద్యాసంస్థల్లో, 58శాతం మంది ప్రభుత్వ విద్యాసంస్థల్లో చదువుతుండగా, 6.7 శాతం ఉన్నత చదువులకు దూరంగా ఉంటున్నారని పేర్కొన్నారు. యువతీయువకుల పఠన నైపుణ్యం, అర్థమెటిక్ టెస్ట్, స్మార్ట్‌ఫోన్ వాడకం, సోషల్ మీడియా వినియోగం తదితర అంశాలపై పరీక్షించగా.. అన్ని డిజిటల్ టాస్కులలోను మహిళల కంటే పురుషులే మెరుగైన సామర్థ్యాలను కనబర్చారని నివేదికలో తెలియజేసినట్టు చెప్పారు.



నాన్‌స్టాప్ కౌంటర్ వద్ద టికెట్ల కోసం..





బస్సులోకి ఎక్కుతున్న ప్రయాణికులు

• తిరుగు ప్రయాణం

సంక్రాంతి ముగిసింది. సొంత గూటికి వచ్చిన వలస పక్షులు మళ్లీ తిరుగు ప్రయాణమవుతున్నారు. ఈ నేపథ్యంలో శ్రీకాకుళం ఆర్టీసీ కాంప్లెక్స్ రద్దీగా మారుతోంది. రద్దీ గమనించిన మేనేజర్లు మల్లికార్జున రావు, ఎస్ఎస్ శర్మ శ్రీకాకుళం డిపో-1 నుంచి 50 బస్సులు, డిపో-2 నుంచి 24 బస్సులు మొత్తం 74 బస్సులను గురువారం ఏర్పాటు చేశారు. విజయవాడ, రాజమండ్రిలకు రెండు డిపోల నుంచి ఏడు డీలక్స్ సర్వీసులు నడిపారు. అంతేకాక పలాస, టెక్కలి డిపోల నుంచి అదనంగా 46 బస్సులు విశాఖపట్నం వెళ్లేందుకు జిల్లాకేంద్రం మీదుగా వచ్చాయని ఇరు డిపోల మేనేజర్లు పేర్కొన్నారు. –శ్రీకాకుళం క్రైమ్

తొలితరం కమ్యూనిస్ట్ నాయకుడు ఉమ్మనాథం మృతి



కమ్యూనిస్టు నాయకుడు మట్ట ఉమ్మనాథం(ఫైల్)

మందస: తొలితరం కమ్యూనిస్టు, రైతాంగ పోరాటాల నాయకుడు మట్ట ఉమ్మనాథం (97) మరణించారు. కొంతకాలంగా అనారోగ్యంతో బాధ పడుతున్న ఆయన గురువారం తుదిశ్వాస విడిచారు. కళింగదళ్, డబారిసింగి రిజర్వాయర్ల సాధన కోసం ఆయన పోరాడారు. తొలుత ఆయన ఖమ్మంలో కానిస్టేబుల్‌గా పనిచేశారు. అనంతరం కమ్యూనిస్టు సిద్ధాంతాలకు ఆకర్షితులై ఉద్యోగం విడిచిపెట్టి 1954లోనే కమ్యూనిస్టు పార్టీ సభ్యత్వం తీసుకున్నారు. అప్పటి నుంచి ఎన్నో ప్రజా పోరాటాలు చేశారు. జీడి పిక్కలు, మెండుభూములు, ఉద్దానం అటవీభూముల పంపిణీ, పౌర హక్కులు తదితర పోరాటాల్లో ఆయన పాలుపంచుకున్నారు. ఉమ్మనాథం మరణవార్త తెలుసుకున్న సీపీఎం, సీఐటీయూ నాయకులు మట్ట ఖగేశ్వరరావు, మామిడి కోదండరావు, టొంప లక్ష్మీనారాయణ, మట్ట ధర్మారావు, పొందర దేవేంద్ర, సాలీన కృష్ణారావు, ధర్మారు వెంకటరావు తదితరులు ఆయన భౌతికదేహంపై ఎర్ర జెండా కప్పి, ఘనంగా నివాళులు అర్పించారు. ఉమ్మనాథానికి భార్య ఆదిలక్ష్మి, కుమారులు మట్ట గోపాల్, విశ్వనాథం, కుమార్తె కృష్ణవేణి ఉన్నారు.

సికిల్‌సెల్ ఎనీమియా బాధితులను గుర్తించండి

- ఐటీడీఏ పీఓ కల్పనాకుమారి



సికిల్‌సెల్ రక్తపరీక్షలను పరిశీలిస్తున్న పీఓ కల్పనాకుమారి

సీతంపేట: గ్రామాల్లో సికిల్‌సెల్ ఎనిమియా బాధితులను గుర్తించాలని ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి కల్పనాకుమారి వైద్య సిబ్బందిని ఆదేశించారు. మండలంలోని జిల్లేడుపాడు గ్రామాన్ని ఆమె గురువారం సందర్శించారు. రోగులకు చేస్తున్న రక్త పరీక్షలను పరిశీలించారు. వ్యాధి నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను ప్రజలకు తెలియజేయాలన్నారు.

పర్యాటక పనులు పూర్తి చేయాలి

ఐటిడీఏ పరిధిలో చేపడుతున్న పర్యాటక పనులు వేగవంతం చేయాలని పీఓ సూచించారు. ఆడలి వ్యూపాయింట్ పనులు మందకొడిగా సాగడంపై అసంతృప్తి వ్యక్తంచేశారు. సంబంధిత ఏఈపై చర్యలకు సిఫార్సు చేశారు. పనుల్లో నాణ్యత లోపిస్తే చర్యలు తప్పవన్నారు. అనంతరం ఆడలి, వజ్జాయిగూడ, కోడిశ గ్రామాల్లో పోలింగ్ స్టేషన్లను పరిశీలించారు. అవసరమైన సౌకర్యాలు కల్పించాలని ఎన్నికల సిబ్బందిని ఆదేశించారు.

ఘనంగా వల్లభ నారాయణ స్వామి రథోత్సవం



గ్రామంలో రథయాత్ర జరుగుతున్న దృశ్యం (ఇన్‌సెట్లో) వల్లభ నారాయణ స్వామికి పట్టువస్త్రాలను సమర్పిస్తున్న దృశ్యం

శ్రీకాకుళం రూరల్: నైరా గ్రామంలో వెలసిన వల్లభ నారాయణ స్వామి రథోత్సవం గురువారం ఘనంగా నిర్వహించారు. సర్పంచ్ అరవల రామ్‌ప్రతాప్ ఆధ్వర్యంలో ప్రధాన పురోహితులు జోషుల నర్సింహామూర్తి, భద్రం ఆదిత్య శర్మ, బద్రం అరవింద్ శర్మ ఆధ్వర్యంలో పంచామృత అభిషేకం మొదలుకొని స్వామివారి నిజరూప దర్శనంతో పాటు సర్వదర్శనాలు నిర్వహించారు. మధ్యాహ్నం కోడెబళ్ల ఉత్సవాలు, సాయంత్రం అమ్మవారికి ముగ్రాటలు, తిరువీధి ఉత్సవాలను ఆలయ ధర్మకర్తలు కర్రీ కృష్ణమోహన్, అరవల రవీంద్రబాబు, రామ్‌ప్రతాప్ సమక్షంలో నిర్వహించారు.

పిచ్చికుక్క దాడిలో చిన్నారులకు గాయాలు



పిచ్చి కుక్క దాడిలో గాయపడిన దొడ్ల లీలారాణి

మందస: అల్లిమెరక గ్రామంలో పిచ్చికుక్క రెండు రోజులుగా ప్రజలను ఇబ్బంది పెడుతోంది. గురువారం ఇద్దరు చిన్నారులపై దాడి చేసి, గాయపరిచింది. సంకిలి కావ్య, దొడ్ల లీలారాణి అనే ఇద్దరు బాలికలపై కుక్క దాడి చేసింది. సకాలంలో కుటుంబ సభ్యులు స్పందించి, హరిపురం సామాజిక ఆరోగ్య కేంద్రంలో చేర్పించి, చికిత్స అందించారు.